సాక్షి పల్నాడు

శనివారం ¦ 12 ¦ ఏప్రిల్ ¦ 2025



ముగిసిన సదరం క్యాంప్

తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునఃపరిశీలనలో భాగంగా తెనాలి జిల్లా వైద్య శాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన నకిల వెంకటేష్, వెంకటలక్ష్మీ భార్గవి దంపతులు శుక్రవారం రూ.లక్ష అందజేశారు.

సేవలు, మొక్కుబడులు నిలిపివేత



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో మే ఒకటి నుంచి ఐదో తేదీ వరకు ఆర్జిత సేవలు, మొక్కుబడులు తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఈఓ కె.సునీల్ కుమార్ శుక్రవారం తెలిపారు. అమ్మవారి దర్శనం మాత్రమే యథాతథంగా ఉంటుందని, భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



గుంటూరు వెస్ట్ (క్రీడలు): విజయవాడలో ఈనెల 13, 14 తేదీల్లో జరగనున్న ఏపీ స్టేట్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు వీఎస్ఎస్ లలిత్, ఎస్.చరణ్ కుమార్, వి.హర్షిణి ఎంపికయ్యారని కోచ్ జీవీఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ ఆధారంగా వీరిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర పోటీల్లోనూ పతకాలు తీసుకొస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

మిర్చి యార్డుకు వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శనివారం నుంచి వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. శని, ఆదివారాలు యార్డుకు సాధారణ సెలవులు, సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవం పురస్కరించుకుని మిర్చి యార్డుకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్టు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో రైతులు సరుకును యార్డుకు తీసుకురావద్దని ఆమె కోరారు. సోమవారం అర్ధరాత్రి నుంచి సరుకును యార్డులోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మంగళవారం యథావిధిగా యార్డులో క్రయ విక్రయాలు కొనసాగుతాయని ఆమె వివరించారు.

నేడు టీచర్ బదిలీలు, ఉద్యోగోన్నతులపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు, సీనియార్టీ జాబితాలపై శనివారం సాయంత్రం 4.00 గంటలకు జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహ్మద్ ఖాలీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ పాల్గొని ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

డ్రోన్ల వినియోగంతో సమయం ఆదా



కొరిటెపాడు(గుంటూరు): పురుగు మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగంతో రైతులకు సమయం ఆదా అవుతుందని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక కృషి భవన్‌లో శుక్రవారం సాయంత్రం డ్రోన్ల నమూనాలను రైతుల అవగాహన కోసం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్‌కేవీవై పథకం ద్వారా రైతుల గ్రూపులకు 80 శాతం సబ్సిడీపై కిసాన్ డ్రోన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. డ్రోన్ల తయారీదారుల ప్రతినిధులు రవికుమార్, సుధీర్ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు డ్రోన్లను కొనుగోలు చేయడానికి అన్ని బ్యాంకులకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ ప్రతినిధులు, ఏపీ ఆగ్రోస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

15 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం

నిజాంపట్నం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులపాటు సముద్ర జలాలలో చేపల వేట నిషేధించినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సాయిసందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సముద్రంలో వివిధ చేపలు, రొయ్యల జాతుల సంతాన ఉత్పత్తి జరుగుతున్న సమయంలో ప్రభుత్వం ప్రతి ఏటా 61 రోజులపాటు వేట నిషేధం అమల్లోకి తెస్తుందన్నారు. రొయ్య, చేప జాతులు గుడ్లు పెట్టి సంతానోత్పత్తికి దోహదపడే సమయం కావడంతో మండలంలోని మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్లరాదని ఆయన తెలియజేశారు. నిషేధాన్ని ఉల్లంఘించి వేటకు వెళ్లిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సాయి సందీప్ హెచ్చరించారు.

కందిపోతున్న రైతులు

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిరాశలో కంది రైతులు
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.7550
- బహిరంగ మార్కెట్‌లో రూ. 6,200 మించి కొనని దళారులు
- గతేడాది ఇదే సీజన్‌లో క్వింటా రూ.10వేలు
- కళ్ల ముందు అప్పులు
- చేసేది లేక దళారులకు అమ్ముకుంటున్న రైతులు



పెదకూరపాడులో సాగులో ఉన్న కంది పంట

అమరావతి: గిట్టుబాటు ధర మాట దేవుడెరుగు అసలు కొనే నాథుడు లేక కంది రైతులు నిరాశలో కూరుకుపోయారు. అప్పులకు వడ్డీలు కట్టలేక, అయిన కాడికి పంటను తెగనమ్ముకుంటున్నారు. కూటమి సర్కారు ఘనంగా మద్దతు ధర రూ.7550 ప్రకటించి చేతులు దులుపుకుంది. ఈ మేరకు రైతుల నుంచి పంటను కొనుగోలు చేసేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టలేదు. రైతు సేవా కేంద్రాల్లో మద్దతు ధరకు ఇదుగో కొంటున్నాం.. అదిగో కొంటున్నాం అంటూ అధికారులు కూడా కాలయాపన చేస్తున్నారే తప్పా ఇంత వరకు కొన్న దాఖలాలు లేవు. ప్రభుత్వ మాయ మాటలతో విసుగెత్తిన రైతులు బహిరంగ మార్కెట్‌లో దళారులు నిర్ణయించిన ధరకే అమ్ముకుని నష్టాలు మూట కట్టుకుంటున్నారు. ప్రభుత్వం రంగంలోకి దిగి కొనుగోలు చేయక పోతే మొత్తం దళారుల పాలవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం

ఈ ఏడాది కంది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లావ్యాప్తంగా 67,500 ఎకరాలలో 50వేలమంది రైతులు సాగు చేశారు. ఎకరాకు మూడు నుంచి మూడున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ లెక్కన జిల్లా మొత్తం మీద 2.36 లక్షల క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చింది. అయితే, రైతుల వద్ద ఉన్న పంట మొత్తాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనే పరిస్థితి కనిపించడం లేదు. రైతు సేవా కేంద్రాలలో అక్కడక్కడా కొనుగోలు చేసి అధికారులు మమ అనిపించారు.

బయటి మార్కెట్లో క్వింటాలు కంది రూ.6,200 నుంచి రూ.6,300లోపే పలుకుతోంది. ధర పెరుగుతుందనే ఆశతో కొందరు రైతులు ఇళ్లలోనే పంటను నిలువ చేశారు. జిల్లాలో ఇంకా రైతుల వద్ద లక్ష టన్నులకు పైగా కందులు ఉన్నాయని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ధరలు 'ఆశా'జనకం

గత ప్రభుత్వ హయాంలో కంది పంట ధర ఆశాజనకంగా ఉండడంతో జిల్లాలో ఎక్కువ మంది రైతులు సాగుపై మొగ్గు చూపారు. భారీ వర్షాలు, వరదలు కారణంగా దెబ్బతిన్న ప్రధాన వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయంగా గతంలో కంటే జిల్లాలో అంచనాలకు మించి రైతులు కంది సాగు చేశారు.ఈ ఏడాది దిగుబడి ఫర్వాలేదనిపించినా మార్కెట్‌లో పడిపోయిన ధరలు మాత్రం రైతుల నడ్డి విరుస్తున్నాయి. జిల్లాలోని 28 మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కంది పంటను మద్దతు ధరకు కొంటామని ప్రభుత్వం చెబుతున్నా గ్రామస్థాయిలో నెల రోజుల నుంచి కాలయాపన చేయడం తప్పా కొనే నాథుడు కరువయ్యాడు. తేమ ఉందని, ఈ-పంటలో నమోదు చేసుకోలేదని తదితర కుంటి సాకులు చెబుతూ రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నారు.

వారం రోజుల్లో కొనుగోలు

అన్ని రైతు సేవాకేంద్రాలలో కంది పంటను రికార్డు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. కొన్ని గ్రామాల్లో శాంపిల్స్ కూడా పంపగా మార్క్‌ఫెడ్ అధికారులు కూడా చూశారు. మరో వారం రోజుల్లో గ్రామాల్లో రైతుల దగ్గర కంది పంటను కొనుగోలు చేస్తాం

–షేక్ అహ్మద్, మండల వ్యవసాయశాఖాధికారి అమరావతి

దళారులకు లాభం.. రైతుకు నష్టం

గతేడాది ఇదే సీజన్‌లో కంది క్వింటాలును రూ. 10వేలకు పైగా రైతులపై ఎటువంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేశారు.ఈ ఏడాది ఇంతవరకు కొనుగోలు చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో మార్కెట్‌లో తక్కువ రేటుకు పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా దళారులు రైతుల్ని దోచుకుంటున్నారు. క్వింటాలు రూ. 6200 మధ్య కొనుగోలు చేసినా పలు ఆంక్షలు పెడుతున్నారు. జల్లెడ పట్టి, రవాణా ఖర్చుల పెట్టుకుంటేనే కొనుగోలు చేస్తామని చెబుతుండటంతో రైతుకి అదనంగా మరో రూ. 300 నుంచి రూ. 400 ఖర్చు అవుతోంది. దీనివల్ల క్వింటాలు కందులు అమ్మితే రైతులకు రూ. 5,800 నుంచి రూ. 6,000 మాత్రమే చేతికొస్తున్నాయి. ప్రస్తుత ఖర్చులు పోనూ నష్టం తప్పా లాభం లేక అప్పులపాలవుతున్నాడు

రైతులకు మిగిలేది నష్టమే !



ఈ ఏడాది పంట బాగానే పండింది. అయితే మార్కెట్‌లో ధర లేక నష్టం వచ్చే పరిస్థితి ఉంది. రైతు సేవా కేంద్రాలలో ఇప్పటి వరకు కందులు కొనుగోలు చేయడం లేదు. దళారులు క్వింటా రూ. 6300 అడుగుతున్నారు గానీ జల్లెడపట్టి వారి గోడౌన్‌కు తరలించే రవాణా ఖర్చులు కూడా భరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ లెక్కన క్వింటా రూ. 6వేలకు మించి రేటు రావడం లేదు

–ఈ. సుధాకరరెడ్డి, కంది రైతు, మునగోడు, అమరావతి మండలం

అసమర్థత కప్పిపుచ్చుకునేందుకే జగన్‌పై ఎంపీ ఆరోపణలు

పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల రూరల్: ఎన్నికల్లో ఓట్లు, సీట్లు కోసం ఇచ్చిన హామీలను అమలు చేయక కూటమి నేతలు కుట్రలు పన్నుతూ, తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాజీ సీఎం వైఎస్. జగన్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అలవిగాని హామీలిచ్చి వాటిని అమలు చేయలేక, ప్రజల సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్‌పై ప్రశ్నిస్తున్న జగన్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షాకు ఫిర్యాదు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విజ్ఞాన్ విద్యా సంస్థలకు చెందిన లావు కృష్ణదేవరాయలుకు రాజకీయంగా ఏ మాత్రం అనుభవం లేకపోయినా, యువకులను ప్రోత్రహించాలన్న ఉద్దేశంతో తమ నాయకుడు జగన్ ఆ రోజు మొదటి సారిగా ఎంపీ అభ్యర్థిగా అవకాశమిచ్చి భారీ మెజార్టీతో గెలిపించినట్లు గుర్తు చేశారు. అధికారం కోసం అడ్డమైన దారులు తొక్కే కృష్ణదేవరాయల దుర్బుద్ధి ఇప్పుడు బయట పడిందని తెలిపారు. కృష్ణదేవరాయలు ఎంపీగా గెలిచారంటే అది జగన్, పల్నాడు ప్రజలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తల గొప్పతనమేనని పేర్కొన్నారు. ఇప్పుడు జగన్‌పై ఉన్న కేసుల గురించి అమిత్‌షా వద్ద కృష్ణదేవరాయలు ప్రస్తావించటమంటే అది ఆయన అజ్ఞానమని చెప్పారు. చంద్రబాబు, లోకేష్‌ల డైరెక్షన్‌లో కృష్ణదేవరాయలు ఆడుతున్న డ్రామా అని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర లేక అన్నదాతలు అప్పులపాలవుతుంటే వారిని ఆదుకోవడంలో ఎంపీగా విఫలమైన కృష్ణదేవరాయలు వరికపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం ఆయన అసమర్థత తెలుపుతుందని పిన్నెల్లి విమర్శించారు.

దివ్యాంగులకు 'సదరం' శిక్ష

- ప్రభుత్వాసుపత్రిలో వారానికి మూడు రోజులు మాత్రమే క్యాంపు
- వంద కిలోమీటర్ల దూరం నుంచి అవస్థలు పడుతూ వస్తున్న దివ్యాంగులు
- జిల్లాలోని 3,339మంది పరీక్షలకు పేట రావాల్సిందే..
- రాకపోకలకు వ్యయ ప్రయాసలు



బంధువుల సాయంతో క్యాంపునకు వస్తున్న అంధురాలు వెలుగొండ చెంచమ్మ



సదరం క్యాంపులో పరీక్షిస్తున్న వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్

నరసరావుపేట: నిండు వేసవి కాలం..కళ్లు కనపడవు..కాళ్లు నడవనీయవు..ఈ పరిస్థితుల్లో సదరం క్యాంపులకు రావడానికి దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు. 100 నుంచి 120 కిలోమీటర్లు ప్రయాణిస్తే గానీ ప్రభుత్వాసుపత్రిని చేరుకోలేని దయనీయమైన పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. సాధారణ పింఛన్‌దార్లకు నెలకు రూ.4వేలు ఇస్తుండగా, దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక భారం తగ్గించుకునేందుకు పింఛన్లు తగ్గించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. పునఃపరిశీలన పేరుతో దివ్యాంగులను ఇబ్బంది పెడుతోంది. చాలా కాలం నుంచి పింఛన్లు పొందుతున్న వారికి మళ్లీ పరీక్షలు అంటూ సదరం క్యాంపులు నిర్వహిస్తోంది.

వేసవిలో అవస్థలు

జిల్లా మొత్తం ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు పొందే దివ్యాంగులు 35,369మంది ఉన్నారు. వీరిలో చూపు సక్రమంగా లేనివారు 3,339 మంది, అంగవైకల్యంతో పొందేవారు మరో 2,135మంది ఉన్నారు. చెవిటివారు 4111మంది, మెంటల్ రిటార్డేషన్‌తో 3,707మంది, మెంటల్ ఇల్‌నెస్‌తో పింఛన్ పొందేవారు 611మంది ఉన్నారు. వీరిలో కళ్ల సమస్యలతో పింఛన్ పొందేవారికి జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ప్రభుత్వాసుపత్రిలో బుధ, గురు, శుక్రవారాల్లో పునఃపరిశీలన క్యాంపులు ఏర్పాటు చేశారు. వినుకొండకు అవతల 25కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు చెందిన దివ్యాంగులతో పాటు మాచర్లకు సుదూరంగా ఉన్న విజయపురిసౌత్ నుంచి కూడా హాజరుకావాల్సిన పరిస్థితి నెలకొంది. మండు వేసవిలో వీరంతా చెమటలు కక్కుతూ తోబుట్టువులు, బంధువుల సహాయంతో ఉదయాన్నే పది గంటలకల్లా క్యాంపుకు చేరుకుంటున్నారు. డాక్టర్లు అంతా సెలవులు తీసుకోకుండా క్యాంపునకు హాజరైతే రెండు గంటల్లో పని ముగించుకొని తిరుగు ప్రయాణమవుతారు. వీరిని పరీక్షించి సర్టిఫికెట్ ఓకే చేయాల్సిన డాక్టర్లు సెలవు తీసుకుంటే మరో రెండు గంటలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది.



క్యాంపునకు వచ్చిన చేతులు, కాళ్లులేని బధిరుడు

ఖర్చులతో సతమతం

శిబిరానికి వచ్చిపోయేందుకు కనీసం రూ.1000 వరకు ఖర్చు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేటు వాహనాల ద్వారా వస్తే వేల రూపాయలు చెల్లించాల్సిందే. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌లో శుక్రవారం నిర్వహించిన సదరం క్యాంపుకు 110మందికి గానూ 84మంది హాజరయ్యారు. జిల్లా మొత్తంపై ముగ్గురు కంటి డాక్టర్లు మాత్రమే ఉన్నారు. ఇందులో ఒకరు ఏలూరుకు బదిలీ కావడంతో వైద్యశాల సూపరిండెండ్ సురేష్‌కుమార్, మరో కంటి డాక్టర్ పరీక్షలు చేస్తున్నారు.

సంఘ సంస్కరణలకు ఆద్యుడు జ్యోతీరావు పూలే

- కార్యాలయంలో నివాళులు అర్పించిన కలెక్టర్, ఎమ్మెల్యే
- బీసీలకు రూ.13కోట్ల మెగా రుణ చెక్కు పంపిణీ



కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, బీసీ నాయకులు

నరసరావుపేట: సంఘ సంస్కరణలకు ఆద్యుడు జ్యోతీరావు పూలే అని జిల్లా కలెక్టర్ పి.అరుణబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జ్యోతీరావు పూలే జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

రూ.51కోట్ల సబ్సిడీతో రుణాల మంజూరు లక్ష్యం

బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో 2107 మందికి సుమారు రూ.51కోట్ల సబ్సిడీతో రుణాలు మంజూరు లక్ష్యంగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో బీసీలకు 1136 మందికి రూ.22.99కోట్లు, 461మంది కాపులకు రూ.15.48కోట్లు, 63 మంది ఈబీసీలకు రూ.1.66కోట్లు, 204మంది కమ్మకులానికి రూ.5.35కోట్లు, 142మంది రెడ్డి కులానికి చెందిన వారికి రూ.3.71కోట్లు, ఆర్యవైశ్యులు 66 మందికి రూ.1.71కోట్లు, క్షత్రియ కులానికి సంబంధించి ముగ్గురికి రూ.7లక్షలు, బ్రాహ్మణ కులానికి సంబంధించి 32 మందికి రూ.93 లక్షలు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ మహాత్ముల జీవిత చరిత్రలు అంతా చదివి స్ఫూర్తి పొందాలని సూచించారు. 400 మందికి 50శాతం సబ్సిడీతో బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.13 కోట్లు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందచేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి, డివిజినల్ అధికారి కె.మధులత, వెనుకబడిన తరగతుల శాఖాధికారి శివనాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు బాదుగున్నల శ్రీను, మల్లికార్జునరావు, చంద్రశేఖర్, నరసింహారావు, షేక్ మాబు పాల్గొన్నారు. తొలుత పల్నాడు రోడ్డులోని మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కలసి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

వక్ఫ్ బిల్లుపై ముస్లింల మండిపాటు

- ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుతంగా ర్యాలీ
- సంఘీభావం తెలిపిన సీపీఎం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రజాసంఘాల నాయకులు



పట్టణంలో ముస్లింల ర్యాలీ

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా తెచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ నిరసన ర్యాలీ శాంతియుతంగా నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లోని ఈద్గా మైదానం నుంచి ర్యాలీ ప్రారంభమై ఫ్లైఓవర్ మీదుగా మల్లమ్మ సెంటర్, గాంధీ చౌక్, గడియారం స్తంభం సెంటర్, మున్సిపల్ కార్యాలయం మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. దారి పొడవునా రాజ్యాంగం, హక్కులు, మతసామరస్యాన్ని కాపాడాలని, అన్ని మతాలను సమానంగా చూడాలని, నల్ల చట్టాలను రద్దు చేయాలని, వక్ఫ్ బిల్లు వెనక్కు తీసుకోవాలని, హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ ముస్లింలు నినాదాలు చేశారు. ఈ మేరకు ప్లకార్డులు ప్రదర్శించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కె.మధులతకు ముస్లిం జేఏసీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ర్యాలీలో మౌలానా షాహిద్ రాజా, ముఫ్తీ రైస్ అహమ్మద్, రఫీ మౌలానా, మౌలానా బాసిత్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, మాజీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్‌వలి, అబ్దుల్ గఫార్, సమైక్యాంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ జిలాని మాలిక్, ఎంఐఎం మస్తాన్, కరిముల్లా, గోల్డ్ గఫార్, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, సీఐటీయూ జిల్లా నాయకురాలు డి.శివకుమారి, సిలార్ మసూద్, న్యాయవాదులు షరీఫ్, రజాక్‌తో పాటు నియోజకవర్గంలోని ఆయా మసీదుల పేష్ మామ్‌లు, మౌజన్‌లు, ముఫ్తీలు, మౌలాలు, మత పెద్దలు, ముస్లిం యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూలే గొప్ప సంఘ సంస్కర్త

నివాళులు అర్పించిన అదనపు ఎస్పీ సంతోష్



నరసరావుపేట: మహాత్మా జ్యోతీరావు పూలే 18వ శతాబ్దపు గొప్ప సంఘ సంస్కర్తని జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఏఆర్ ఎస్పీ వి.సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, ఆర్ఐలు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

క్రోసూరు: మండలంలోని హసనాబాద్‌లో ఇంటి ఎదురుగా ఉంటున్న వ్యక్తిపై దాడి చేసి, దుర్భాషలాడాడన్న ఫిర్యాదుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసు నమోదు చేసినట్లు క్రోసూరు సీఐ పి.సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన యర్రంశెట్టి గోపాలకృష్ణ అలియాస్ కిట్టు మద్యం తాగి ఇంటి ఎదురుగా ఉంటున్న మాతంగి వెంకటేశ్వరరావు కసువు ఊడుస్తున్న క్రమంలో గొడవ పడి, దుర్భాషలాడాడు. కత్తితో దాడి చేసి గాయపరిచాడు. దీంతో వెంకటేశ్వరరావు సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై అట్రాసిటీస్ కేసు నమోదు చేశామని, సత్తెనపల్లి డీఎస్పీ దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో గురువారం 589 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మినట్టు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 423 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10,225, గరిష్ట ధర రూ.12,225, మోడల్ ధర రూ.11,550 పలికింది. కాయలు 166,బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10.400, గరిష్ట ధర రూ.11,800, మోడల్ ధర రూ.11,550 పలికింది. మొత్తం 441.750 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు వెల్లడించారు.

యార్డులో 1,27,104 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,15,943 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,27,104 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,600 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 54,603 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింల ర్యాలీ

క్రోసూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును నిరసిస్తూ క్రోసూరులో శుక్రవారం ముస్లింలు భారీగా ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. అమరావతి బస్టాండ్ సెంటర్ నుంచి నాలుగు రోడ్ల వరకు ముస్లిం మహిళలు, పురుషులు కలిసి శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ప్రాణాలైనా అర్పిస్తాం– వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తాం, మాకొద్దు, మాకొద్దు – వక్ఫ్ సవరణ బిల్లు మాకొద్దు, రద్దు చేయాలి వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లు మత స్వేచ్ఛను హరించేలా ఉందని తెలిపారు. దేశంలో బీజేపీ పాలన చూస్తే మైనార్టీలపై అణచివేత ధోరణి కనిపిస్తోందని, హిందువుల పరిరక్షణ పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో క్రైస్తవుల ఎండోమెంట్ ఆస్తులపై స్వా. దీన చట్టాలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమం హిందూ, ముస్లింల వివాదం కాదని మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసమని అంతా తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముఫ్తిఖలీల్, ముఫ్తి జమాలుద్దీన్, ఫ్యాన్సీ ఖాదర్, షేక్ అబ్దుల్ ఖాదర్, గఫూర్, కమాల్ బాషా, షేక్ సత్తార్, షేక్ మూసా పాల్గొన్నారు.



క్రోసూరులో ముస్లింల భారీ ర్యాలీ

బల్లికురవ ఎస్ఐని సస్పెండ్ చేయాలి

వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి



అద్దంకి రూరల్: పక్షపాత ధోరణితో టీడీపీకి కొమ్ముకాస్తున్న బల్లికురవ ఎస్ఐ నాగరాజును సస్పెండ్‌ చేయాలని వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. బల్లికురవ మండలంలోని ప్రజలంతా ఐకమత్యంగా, కులమతాలకు, పార్టీలకతీతంగా నిర్వహించుకునే ఈర్ల గంగమ్మ తిరునాళ్లలో ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ వారికి ప్రభలు కట్టుకునేందుకు అనుమతి ఇవ్వకపోవటం ఎస్ఐ పక్షపాత ధోరణికి నిదర్శనమన్నారు. తిరునాళ్లకు కాని, దేవాలయం వైపు కాని వైఎస్సార్ సీపీ నాయకులు రాకుండా చేస్తానని చెప్పటం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా టీడీపీ వారికి తిరునాళ్లలో ప్రభలు కట్టేందుకు అనుమతులు ఇచ్చారన్నారు. ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న కూటమి నాయకులు ప్రజల్లోని వెళ్లే ధైర్యం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపై సోషల్ మీడియాలో నీచంగా మాట్లాడించటం చంద్రబాబునాయుడు నైతికంగా దిగజారడన్నారు. ప్రశాంతంగా ఉండే బల్లికురవ మండలంలో గత వారం ప్రభలు కట్టేందుకు అప్పటి ఎస్ఐ జీవీ చౌదరి అనుమతులు ఇస్తే కొత్తగా వచ్చిన ఎస్ఐ అనుమతులు వైఎస్సార్‌సీపీ ఇవ్వకపోవటం ఏమిటని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉండే అద్దంకి నియోజకవర్గ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న నాగరాజు లాంటి ఎస్సైని ఉన్నతాధికారులు కల్పించుకుని సస్పెండ్ చేయాలన్నారు.

బొబ్బర్లంక ఎస్టీ కాలనీ కుటుంబాలను ఆదుకోవాలి

రేపల్లె రూరల్: వెట్టిచాకిరికి గురైన బొబ్బర్లంక ఎస్టీ కాలనీ కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కూలీలను క్రయవిక్రయాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సీపీఎం, కేవీపీఎస్, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు, ఎస్టీ కాలనీవాసులు శుక్రవారం ఆర్డీఓ నేలపు రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ అమ్మకాలు, కొనుగోలు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మణిలాల్, అగస్టీన్, నాంచారమ్మ, ఆశీర్వాదం, డానియేలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ రామలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, కేవీపీఎస్, ఐద్వా సంఘాల నాయకులు

ఉప్పటూరులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

పర్చూరు(చినగంజాం): ఉప్పుటూరులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు జోరుగా సాగుతున్నాయి. తిరునాళ్లను పురస్కరించుకొని గ్రామంలో రాష్ట్ర స్థాయి పోలురాదా ఎడ్ల బలప్రదర్శన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇసుక బస్తాలతో ఉన్న చక్రాలు తిరగని ఎడ్ల బండిని నిర్ణీత సమయంలో ఎక్కువ దూరం లాగిన ఎడ్ల జతను విజేతగా ప్రకటిస్తారు. విజయం సాధించిన ఎడ్ల జతలకు వరుసగా రూ 50 వేలు, రూ 40 వేలు, రూ 30 వేలు, రూ 20 వేలు బహుమతులుంటాయని నిర్వాహకులు తెలిపారు. వీటితో పాటు కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. మొదటి రోజు సీనియర్స్ విభాగంలో తొమ్మిది ఎడ్ల జతలు పోటీ పడుతున్నాయని తెలిపారు. ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీలకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



పోటీలలో పాల్గొన్న ఎడ్ల జతలు

ఆరోగ్య సంరక్షణలో ఫార్మా కీలకం

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ తదితరులు

గుంటూరు మెడికల్: ఆరోగ్య సంరక్షణలో ఫార్మా రంగం ఎంతో కీలకమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ అన్నారు. శుక్రవారం గుంటూరు కాపిటల్ హోటల్‌లో బెంగళూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఫార్మాటెక్ కన్వర్ట్ –2025 కార్యక్రమానికి వీరపాండియన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఫార్మా రంగం విశిష్టతను వివరించారు. గౌరవ అతిథి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య ట్రస్టు సీఈఓ పి.రవి సుభాష్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ఫార్మా పాత్ర ఎంతో ఉందన్నారు. ఇంకా పలువురు వక్తలు ప్రసంగించారు. విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ బాబు, సెయింట్ మేరీస్ ఫార్మసీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ, కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, బెంగుళూరు ప్రొఫెసర్ ఉషా మంజునాథ్, ఫార్మా కంపెనీ ప్రతినిధులు ఇంద్రనీల్ సింహ, షేక్ గౌస్ షడక్, వర్మ, వీరేంద్రకుమార్, సిప్లా కంపెనీ బిజినెస్ హెడ్ ఎస్.బెనర్జి, బెంగుళూరు గవర్నింగ్ బోర్డు సభ్యుడు డాక్టర్ కేదార్ పాల్గొన్నారు.

జెడ్పీ పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల వేతనాల్లో నుంచి మినహాయిస్తున్న నిధులు సకాలంలో జెడ్పీ పీఎఫ్ ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసుకు ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలోని సీఈవో చాంబర్లో జ్యోతిబసును కలిసి ఎస్టీయూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. సీఈవోను కలసిన వారిలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు కమతం శ్రీనివాసరావు, ఎస్కే బాజీ, తుళ్లూరు మండల అధ్యక్షుడు దిబ్బయ్య, సీనియర్ నాయకులు సీహెచ్ శ్రీనివాస్ ఉన్నారు.

వాట్సాప్‌లో పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు సమాధానాలు

జిల్లాలో వినూత్నంగా చేపట్టిన కలెక్టర్ అరుణ్ బాబు



నరసరావుపేట: ఇక నుంచి జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల అర్జీలకు వాట్సాప్‌లో సమాధానాలు పంపనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. వాట్సాప్‌కే పరిమితం కాకుండా అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోస్టు ద్వారా అర్జీదారుడి ఇంటికే పంపుతామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా సైతం ఒక కాపీ నేరుగా ఫిర్యాదుదారుడికి అందిస్తామని పేర్కొన్నారు. సాంకేతికతతో పాటూ సంప్రదాయ సమాచార మార్గాలను సమర్థంగా వినియోగించుకుని పీజీఆర్ఎస్‌ను ప్రజలకు మరింత చేరువ చేస్తామని తెలిపారు. పీజీఆర్ఎస్‌ను పటిష్ట పరచాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్య మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌ను బలోపేతం చేయడంలో మండల స్పెషల్ ఆఫీసర్లు భాగస్వామ్యం కావాలని ఆదేశించామని తెలియజేశారు. మండల స్పెషల్ ఆఫీసర్లు నేరుగా అర్జీదారుల దగ్గరకు వెళ్లి ఫిర్యాదులపై అధికారుల స్పందన, పరిష్కారాల్లో నాణ్యత, ప్రజలతో అధికారులు వ్యవహరించే తీరును సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటనలు ప్రారంభించి సమీక్షలు నిర్వహించారు.

ఇంటర్ ఫెయిల్ అవుతామనే భయంతో ఇల్లు వదిలి వెళ్లిన విద్యార్థినులు

24 గంటల్లో తల్లిదండ్రులకు అప్పగింత

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడి, తాడేపల్లిలో నివాసముండే ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అవుతామనే భయంతో ఇల్లు వదిలి పారిపోయారు. తాడేపల్లిలో ఉన్న విద్యార్థిని తల్లిదండ్రులు తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి శుక్రవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ గురువారం రాత్రి 11 గంటల సమయంలో తమ పిల్లలు కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి సిఐ కల్యాణ్ రాజు ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టి 24 గంటల్లో వారి ఆచూకీ కనుగొని వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.



విద్యార్థినులను తల్లిదండ్రులకు అప్పగించేందుకు స్టేషన్‌కు తీసుకువచ్చిన తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి

కొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోయండి

- యూనివర్సిటీలలో పరిశోధనలు పెరగాలి
- బెర్హంపూర్ బసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ గంగూలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గంగూలీ

మంగళగిరి: నేటి విద్యార్థులు పరిశోధనా రంగంలో రాణించి కొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోయాలని బెర్హంపూర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్(బసర్) యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ కుమార్ గంగూలీ కోరారు. మండలంలోని నీరుకొండ గ్రామంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం 9వ రీసెర్చ్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ గంగూలీ మాట్లాడుతూ బోధనతో పాటు పరిశోధనా రంగంలో రాణించేలా ప్రొఫెసర్లు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్‌తోపాటు పరిశ్రమల సందర్శన ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. యూనివర్సిటీ వీసీ డాక్టర్ మనోజ్ కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా మాట్లాడుతూ రీసెర్చ్ డేను పురస్కరించుకుని కిండబేజాడ్ మాదిరిగా నలుగురు ప్రొఫెసర్లుకు ఉత్తమ పరిశోధనా పురస్కారాలను ప్రదానం చేస్తున్నామని తెలిపారు. ఉత్తమ ప్రయోగాత్మక పరిశోధన పురస్కారాన్ని డాక్టర్ మాసం పార్థసారథి,ఉత్తమ థియోలాటికల్ రీసెర్చ్ అవార్డును డాక్టర్ ఎం దూరి మురళీకృష్ణ, ఉత్తమ పారిశ్రామిక రంగ పరిశోధనా పురస్కారాన్ని డాక్టర్ దినేష్‌రెడ్డి, ఉత్తమ యువ పరిశోధన పురస్కారం డాక్టర్ హరీష్ పుప్పాలలకు అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారికి రూ.50 వేలు నగదు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, రీసెర్చ్ డే కన్వీనర్ డాక్టర్ సునీల్ చిన్నదురై, డాక్టర్ ఆయాషా తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళ్ల వాగులో గుర్తు తెలియని మృతదేహం

హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు

సత్తెనపల్లి: గుర్తు తెలియని యువకుడి మృతదేహం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల సమీపంలోని వాగులో శుక్రవారం వెలుగు చూసింది. సుమారు 40–45 సంవత్సరాలు వయసు కలిగిన యువకుడు శరీరంపై వంకాయ రంగు తెలుపు నలుపు చారల టీ షర్టు, దానిపై నీలం రంగు నిండు చేతులు చొక్కా ధరించి, నిక్కర్‌తో ఉన్నాడు. మృతుడి కుడి చేతిపై శిలువ గుర్తు పచ్చబొట్టు ఉంది. కుడి చేతికి నల్లని దారం, తెల్ల పూసలతో కాశీ దారం వలే కట్టి ఉంది. మృతుడు ఎత్తు 5.6తో చామనఛాయ రంగు కలిగి ఉన్నాడు. స్థానికుల నుంచి సమాచారం రావడంతో సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వాగులో నుంచి బయటికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. గుర్తు పట్టని విధంగా ఎవరైనా హత్య చేసి పడేశారా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సత్తెనపల్లి రూరల్ సీఐ 9440796231, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ 801999643 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.



వాగులో యువకుడి మృతదేహం

డీఎస్పీ ఆదినారాయణపై కోర్టులో ప్రైవేట్ కేసు

సత్తెనపల్లి: గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సమయంలో ప్రచార నిమిత్తం కూటమి అభ్యర్థి, ప్రస్తుత సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తొండపి వెళ్లారు. ఇరువర్గాల ఘర్షణ నేపథ్యంలో ఆయన పీఆర్ఓ స్వామికి గాయాలయ్యాయి.

అప్పటికే ఇద్దరు ఎస్ఐలు, పది మంది పోలీసులు గ్రామంలో బందోబస్తులో ఉన్నారు. అక్కడ ఉద్రిక్తత పరిస్థితిని బందోబస్తులో ఉన్న ఎస్ఐలు డీఎస్పీ ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింప చేసి గొడవ లేకుండా సర్దుబాటు చేశారు. అయితే, కన్నా పీఆర్వో స్వామికి గాయాలు కావడంతో 324 సెక్షన్ కింద ముప్పాళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. కానీ డీఎస్పీ ఆదినారాయణ ప్రోద్బలంతో హత్యాయత్నానికి ఒడిగట్టారని, ఈ క్రమంలో దాడి జరిగిందంటూ కన్నా లక్ష్మీనారాయణ 307 కింద కేసు నమోదు చేయాలని కోర్టులో ప్రైవేట్ కంప్లైంట్ దాఖలు చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన విచారణకు ఆయన హాజరయ్యారు.